నేటి నుంచి పింఛన్ల పంపిణీ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2: జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ చేపడుతున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రతి సచివాలయంలో పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. ఆ తరువాత 4, 5, 6 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో, సచివాలయాలకు 3 కి.మీ. దూరంలో ఉన్న కుగ్రామాలకు సచివాలయాల ఉద్యోగులే వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తారన్నారు. పంపిణీ సమయంలో తొక్కిసలాటలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు.







ఎన్నికలకు దూరం పెట్టండి!

- జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని కలెక్టర్ గౌతమికి ఆదేశం
- డీజీపీకి రిపోర్ట్ చేసుకోవాలని ఎస్పీ అన్బురాజన్‌కు..
- తక్షణమే అమలులోకి వచ్చిన ఉత్తర్వులు
- అధికార పార్టీతో అంటకాగిన ఫలితం..?

కలెక్టర్, ఎస్పీపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీవేటు

అనంతపురం టౌన్/క్రైం, ఏప్రిల్ 2: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌పై కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడమే వీరి బదిలీకి కారణమని స్పష్టమౌతోంది. ఓటరు జాబితా సవరణ విషయంలో జిల్లాలో భారీగా అక్రమాలు జరిగాయి. పర్యవేక్షణ అధికారులు, బీఎల్వోలు అధికారపార్టీ నేతలకు తలొగ్గి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. ప్రతిపక్ష టీడీపీ సహా ఇతర పార్టీలు ఎన్నికల సంఘానికి గతంలో ఫిర్యాదు చేశాయి. ఉరవకొండ నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా రెండు వేలకు పైగా టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించారు. దీని గురించి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆధారాలతో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు స్వయంగా ఉరవకొండకు వచ్చి విచారించారు. అక్రమాలు నిజమేనని తేల్చారు. వారి ఆదేశాల మేరకు నియోజకవర్గ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఇద్దరు జడ్పీ సీఈఓలను (భాస్కర్ రెడ్డి, శోభా స్వరూప రాణి) సస్పెండ్ చేశారు. ఆ తరువాత ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే నిర్వహించి, తప్పులను సవరించాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చింది. దాదాపు రెండునెలలు ఈ సర్వే సాగినా, తప్పులు పునరావృతమయ్యాయి. దీనిపై టీడీపీ జిల్లా నేతలు కలెక్టరును కలిసి ఫిర్యాదు చేశారు. ఆమె సరిగా స్పందించలేదని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కలిశారు. రాష్ట్రంతోపాటు జిల్లాలో ఓటరు జాబితాలో అక్రమాలు, వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఆధారాలతో ఫిర్యాదు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, కలెక్టరు గౌతమిని కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ చేసినట్లు స్పష్టమౌతోంది.



అంటకాగిన ఐపీఎస్..!

ఎస్పీ అన్బురాజన్ బదిలీకి అధికార పార్టీ నాయకులతో ఆయన సావాసమే కారణమని సమాచారం. గత ఏడాది సెప్టెంబరు 17న అన్బురాజన్ జిల్లాలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా నుంచి వచ్చిన ఆయన.. అక్కడ నాలుగేళ్లకు పైగా పనిచేశారు. ఆ సమయమంతా వైసీపీ నేతలతో అంటకాగారని, ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. సీబీఐ అధికారులపైనే కేసు నమోదు చేయడంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. అనంతపురం జిల్లాకు వచ్చాక కూడా ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు కొనసాగాయి. ఆ పార్టీ నాయకులు తప్పు చేసినా చర్యలు తీసుకోలేకపోయారు.

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై సీఎం జగన్ సమక్షంలోనే.. సిద్ధం సభలో అధికార పార్టీ వారు దాడి చేశారు. దాడి దృశ్యాల వీడియోలు లభించాయి. దాడి చేస్తున్నది ఎవరో స్పష్టంగా కనిపించింది. ప్రజలు సైతం దాడిచేసినవారి వివరాలను బయటపెట్టారు. 'మా ఊరివాడే..' అని చెప్పారు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ దాడి గురించి పోలీసు శాఖ పెద్దగా పట్టించుకోలేదు. కేవలం ఒకరిపై కేసు కట్టి జైలుకు పంపారు. మిగిలిన వారిని పట్టుకోవాలన్న ఆలోచనే చేయలేదు.

'ఎమ్మెల్యే ఇంటివద్ద ఉన్నా.. రా..' అని బండి రవి సవాలు విసిరినా.. పోలీసులు బేలతనం ప్రదర్శించారు. మంత్రి ఉష శ్రీచరణ్ అనుచరుడు అశోక్‌నూ పట్టుకునే ప్రయత్నం చేయలేదు. ఆ కేసు ఏమైందో కూడా బయటకు చెప్పడం లేదు. అధికార పార్టీవారికి పోలీసులు ఏ స్థాయిలో లొంగి పనిచేస్తున్నారో ఈ ఘటనే ఉదాహరణ. ఇక కర్ణాటక మద్యాన్ని జిల్లాలో ఎందుకు అరికట్టలేకపోయారని ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా పిలిపించి అడిగితే.. ఎస్పీ అన్బురాజన్ ఇచ్చిన సమాధానం వారిని నివ్వెరపరిచిందట. రాష్ట్రంలో మద్యం ధరలు తగ్గాయని, ప్రస్తుతం కర్ణాటక మద్యం అక్రమ రవాణా తగ్గిందని చెప్పారట. ఈ ఎన్నికల్లో ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే అవకాశం ఉందని తేలడంతో ఆయనను బదిలీ చేశారని సమాచారం.



ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ కేతన్‌గార్గ్



అనంతపురం టౌన్, ఏప్రిల్ 2: కలెక్టర్ గౌతమి బదిలీ నేపథ్యంలో ఇన్‌చార్జి కలెక్టరుగా జేసీ కేతన్ గార్గ్ మంగళవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో కలెక్టర్ గౌతమి మంగళవారం రాత్రి రిలీవ్ అయ్యారు. సీఈసీ సూచనల మేరకు కేతన్ గార్గ్‌కు బాధ్యతలు అప్పగించారు. కొత్త కలెక్టరు వచ్చేవరకూ ఆయన జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు.

ఇన్‌చార్జి ఎస్పీ.. విజయభాస్కర్ రెడ్డి



ఎస్పీ అన్బురాజన్ మంగళవారం రాత్రి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తన కిందిస్థాయి కేడర్ అధికారి, ఏఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డికి బాధ్యతలను అప్పగించారు. కొత్త ఎస్పీ వచ్చేదాకా ఆయన ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

పొదుపు సొమ్ముకు ఎసరు

- రైతు సాధికార సంస్థ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలట
- సమాఖ్యల సొమ్ము చెల్లించాలని 'సెర్ప్' ఆదేశాలు
- సేంద్రియ వ్యవసాయం పేరుతో మరో దోపిడీ



డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయం



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2: పొదుపు మహిళలు కష్టపడి దాచుకున్న సొమ్ముపై ప్రభుత్వం కన్నేసింది. సమాఖ్య డబ్బును సిబ్బంది జీతాలకు మళ్లించాలని చూస్తోంది. 'సెర్ప్' పరిధిలోని డీఆర్‌డీఏ-వైకేపీ అమలు చేస్తున్న రైతు సాధికార సంస్థలో (ఆర్‌వైఎస్‌ఎస్) సుమారు 60 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి రెండేళ్లుగా వేతనాలు చెల్లించలేదు. బకాయి వేతనాలతో పాటు మరో ఏడాదికి కలిపి మొత్తం రూ.7.2 కోట్లు కాజేసేందుకు యత్నిస్తున్నారు. ఇదంతా అక్కా చెల్లెమ్మలకు సంబంధించిన సొమ్ము కావడం గమనార్హం. ఇప్పటికే మండల సమాఖ్యల ద్వారా నిధులు సేకరించి, రైతు సాధికార సంస్థ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని సెర్ప్ ఆదేశించినట్లు సమాచారం. దీనికి ఏపీఎంలు అంగీకరించక పోవడంతో డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. మండల సమాఖ్యల నిధులను వేతనాలకు మళ్లిస్తే.. తిరిగి ఆ నిధులు ఎప్పుడు వస్తాయని సమాఖ్య మహిళలు ప్రశ్నిస్తున్నారు.

సేంద్రియం పేరుతో..

డీఆర్‌డీఏ-వైకేపీ పరిధిలోని మండల సమాఖ్యల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేలా ఒప్పందం చేసుకున్నారు. డీఆర్‌డీఏ-వైకేపీ, రైతు సాధికార సంస్థతో పాటు స్త్రీనిధిని ఎంఓయూలో భాగస్వామిగా చేశారు. పేద డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి నుంచి రుణాలు అందిస్తున్నారు. ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్ట్ అమలుకు అవసరమైన నిధులను స్త్రీనిధి నుంచి 11 శాతం వడ్డీతో రైతు సాధికార సంస్థకు రుణం ఇస్తారు. ఆ సంస్థకు నిధులు వచ్చిన తరువాత స్త్రీనిధికి తిరిగి చెల్లిస్తారు. రైతు సాధికార సంస్థ చెల్లించని పక్షంలో మండల సమాఖ్యల వద్ద ఉండే సీఐఎఫ్ నిధుల నుంచి స్త్రీనిధి సంస్థ రికవరీ చేసుకుంటుంది. మొత్తంగా.. రైతు సాధికార సంస్థ రుణం తిరిగి చెల్లించకుంటే నష్టపోయేది పొదుపు మహిళలే. సేంద్రియ వ్యవసాయం అమలు చేస్తామంటూ రైతు సాధికార సంస్థ ఒప్పందం చేసుకోవడం తమకు ఇబ్బందికరంగా మారిందని డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సీఎం సభలకు విచ్చలవిడిగా సీఐఎఫ్ నిధులు ఖర్చు చేస్తుండటంతో డీఆర్‌డీఏ-వైకేపీ మండల కార్యాలయాల నిర్వహణ భారమవుతోంది.

ఒత్తిడి చేయడం లేదు



మండల సమాఖ్యల నుంచి రైతు సాధికార సంస్థ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సెర్ప్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమే. అయితే మండల సమాఖ్యలపై ఎటువంటి ఒత్తిడి లేదు. ఆసక్తి, నిధులు ఉన్న మండల సమాఖ్యలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో వేరే ఉద్దేశం లేదు. సిబ్బందికి వేతనాలు ఇచ్చిన తరువాత, ప్రభుత్వం నిధులు ఇచ్చిన వెంటనే వడ్డీతో కలిపి మండల సమాఖ్యలకు నిధులు చెల్లిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.


- నరసింహారెడ్డి,
డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ

మరణమే శరణమా..?

అన్నదాతకు కలిసిరాని సేద్యం.. ఒకే రోజు ముగ్గురి ఆత్మహత్య



మిద్దె గోపాల్‌రెడ్డి (ఫైల్)



కౌలు రైతు సంగప్ప(ఫైల్)

అన్నదాతలకు సేద్యం ఏమాత్రం కలిసిరావడం లేదు. ఏ పంట సాగుచేసినా గట్టెక్కే మార్గం కనిపించడంలేదు. అప్పులు కుప్పలుగా పేరుకుపోవడంతో తీర్చేమార్గం తెలియక ఉసురు తీసుకుంటున్నారు. ఒకే రోజు ముగ్గురు రైతుల ఉసురు తీసింది వ్యవసాయం. వీరిలో ఇద్దరు ఉద్యాన రైతులు కాగా.. ఒకరు కౌలు రైతు. బాధిత కుటుంబాలలో తీవ్ర విషాదం అలుముకుంది. ఇంటి పెద్దలను కోల్పోయిన భార్య, పిల్లలు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

తాడిపత్రి టౌన్/పెద్దపప్పూరు/కూడేరు, ఏప్రిల్ 2: జిల్లాలో అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన రైతు మిద్దె గోపాల్ రెడ్డి(59) మంగళవారం ఉరివేసుకున్నాడని రూరల్ పోలీసులు తెలిపారు. గోపాల్‌రెడ్డి తనకున్న ఐదు ఎకరా పొలంలో ఆరేళ్ల క్రితం చీనీమొక్కలు నాటాడు. సాగునీటి కోసం ఎనిమిది బోరుబావులు తవ్వించారు. పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం దాదాపు రూ.15 లక్షలు అప్పు చేశాడు. పంట దిగుబడి సరిగా రాకపోవడంతో అప్పులు పేరుకుపోయాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది తోటవద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు. గోపాల్‌రెడ్డికి భార్య పుల్లమ్మ, కుమారులు లోకనాథ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి ఉన్నారు.

- పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామానికి చెందిన రైతు నల్లయ్య(54) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. నల్లయ్య నాలుగు ఎకరాలలో కరివేపాకు పంటను సాగుచేశాడు. పెట్టుబడుల కోసం రూ.8 లక్షలదాకా అప్పు చేశాడు. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ధర కూడా పతనమైంది. దీంతో అప్పులు తీర్చేమార్గంలేక ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ శివారులోని అరటితోటలో మంగళవారం నల్లయ్య మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నల్లయ్యకు భార్య అనంతమ్మ, కుమారుడు రవితేజ, కూతురు ఉన్నారు.

- కూడేరు మండలం కడదరకుంట గ్రామానికి సంగప్ప(35) అనే కౌలు రైతు మంగళవారం ఉరివేసుకున్నాడు. సంగప్ప ఐదారు సంవత్సరాలుగా భూములను కౌలుకు తీసుకుని వేరుశనగ, వరి, ఆముదం తదితర పంటలు సాగు చేస్తున్నాడు. దిగుబడి సక్రమంగా రాకపోవడంతో నష్టపోయాడు. పెట్టుబడి, కుటుంబ అవసరాల కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గంలేక తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో తోటకు వెళుతున్నానని చెప్పి సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. చీకటి పడినా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు అర్ధ రాత్రి వెళ్లి తోటలో వెదికారు. చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. సంగప్పకు భార్య మంజుల, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ప్లీజ్.. రాజీనామా చేయండి..!

వలంటీర్లకు వైసీపీ ప్రలోభాలు

- ఎంపీడీఓ కార్యాలయం వద్ద హైడ్రామా
- యాడికిలో కొందరు వలంటీర్ల వాగ్వాదం



వలంటీర్లతో రాజీనామా చేయిస్తున్న వైసీపీ సోషల్‌మీడియా కన్వీనర్ (తెల్లచొక్కా వ్యక్తి)

యాడికి, ఏప్రిల్ 2: ఎన్నికలలో లబ్ధి పొందేందుకు వైసీపీ నాయకులు అడ్డదారుల్లో వెళుతున్నారు. వలంటీర్ల చేత మూకుమ్మడిగా రాజీనామా చేయించేందుకు బతిమాలుతున్నారు. ప్రలోభపెడుతున్నారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు రాజీనామా లేఖలో పేర్కొంటున్నా.. వైసీపీ నాయకుల ఒత్తిళ్లే కారణమని స్పష్టంగా అర్థమౌతోంది. ఇందుకు యాడికి ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం చోటు చేసుకున్న పరిణామాలే నిదర్శనం. యాడికి పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలో 52 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా చేయడానికి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు రావాలని వలంటీర్లకు సంబంధించిన ఒక గ్రూపులో వైసీపీ నాయకులు మెసేజ్ పెట్టారు. దీంతో వలంటీర్లు ఒక్కొక్కరుగా ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడికి వచ్చిన వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్, రాజీనామా చేయాలని వలంటీర్లకు విన్నవిస్తూ కనిపించారు. రాజీనామా లేఖలను అతనే ఎంపీడీఓ కార్యాలయంలో ప్రింట్ తీయించడం గమనార్హం. వాటిలో వలంటీరు పేరు, క్లస్టర్, పంచాయతీ.. తదితర వివరాలు రాసేందుకు వీలుగా ఖాళీలను ఉంచారు. ఆ ఖాళీలను పూరించి.. సంతకం చేయాలని వలంటీర్లకు సోషల్ మీడియా కన్వీనర్ సూచించాడు. ఇలా జరుగుతున్న సమయంలో కొందరు వలంటీర్ల మధ్య వాగ్వాదం జరిగింది. కొందరు రాజీనామా ఎందుకు చేయాలని ప్రశ్నించడంతో వివాదం తలెత్తింది. వైసీపీ సోషల్‌మీడియా కన్వీనర్ వారివద్దకు వెళ్లి సర్దిచెప్పడంతో అయిష్టంగానే రాజీనామా చేశారు. వలంటీర్లు గుంపులు గుంపులుగా వెళ్లి తమ రాజీనామా లేఖలను ఎంపీడీఓకు అందించారు.

రెండునెలల జీతం ఎర

ఇప్పుడు రాజీనామా చేస్తే ఏప్రిల్, మే జీతాలను తామే ఇస్తామని వైసీపీ నాయకులు ప్రలోభపెట్టారని కొందరు వలంటీర్లు అన్నారు. ఎన్నికలయ్యే దాకా పార్టీ కోసం పనిచేయాలని వారు సూచించారని తెలిపారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే కచ్చితంగా వలంటీర్లుగా తీసుకుంటామని భరోసా కల్పించి.. వలంటీర్లను రాజీనామాకు ఉసిగొల్పినట్లు మండలవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. వలంటీర్ల కోసం కొత్తగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశామని, వలంటీర్లు అందరూ అందులో చేరాలని వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వాయిస్ మెసెజ్ పెట్టారు. రాజీనామా లేఖలు అందజేసిన వలంటీర్లు అందరూ వైసీపీ కోసం పనిచేయడం కోసమే కొత్త వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు.



రాజీనామాపై వలంటీర్ల మధ్య వాదన



రాజీనామా చేయాలంటూ నచ్చజెప్పుతున్న వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్



రాజీనామా లేఖలను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు



చిన్నప్పయ్య రాయదుర్గం అభ్యర్థి



సాకే శైలజానాథ్, శింగనమల అభ్యర్థి



నాగిరెడ్డి, తాడిపత్రి అభ్యర్థి



మధుసూదన్ రెడ్డి, ఉరవకొండ అభ్యర్థి



కావలి ప్రభాకర్, గుంతకల్లు కాంగ్రెస్ అభ్యర్థి



ఆది ఆంధ్ర శంకర్, రాప్తాడు అభ్యర్థి

ఎన్నికల బరిలో కాంగ్రెస్

ఆరు స్థానాలకు అభ్యర్థుల ఖరారు

అర్బన్, కళ్యాణదుర్గం, ఎంపీ స్థానం పెండింగ్

అనంతపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరానికి కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమైంది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకుగానూ ఆరింటికి ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. అభ్యర్థుల ఖరారు జాబితాను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇడుపులపాయలో మంగళవారం విడుదల చేశారు. అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం అసెంబ్లీ స్థానాలతో పాటు అనంతపురం పార్లమెంటు స్థానానికి అభ్యర్థులను ఖరారు చేయలేదు. రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, రాప్తాడు, శింగనమలకు అభ్యర్థులను ప్రకటించారు. రాయదుర్గం స్థానానికి పార్టీ సీనియర్ నాయకుడు ఎంబీ చిన్నప్పయ్య, ఉరవకొండకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ ఉరవకొండ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి సోదరుడు వై.మధుసూదన్‌రెడ్డి, గుంతకల్లుకు పార్టీ సీనియర్ నాయకుడు కావలి ప్రభాకర్, తాడిపత్రికి పార్టీ సీనియర్ నాయకుడు గుజ్జల నాగిరెడ్డి, శింగనమలకు పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్, రాప్తాడుకు పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆది ఆంధ్ర శంకరయ్య పేర్లను ప్రకటించారు.

అందుకే పెండింగ్..

అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయకపోవడానికి పలు కారణాలు ఉన్నట్లు తెలిసింది. అనంతపురం అర్బన్ టిక్కెట్‌ను బలిజ సామాజికవర్గానికి చెందిన వజ్జల మల్లికార్జున(పాలమల్లి), ముస్లిం మైనార్టీ నాయకుడు, ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, మున్సిపల్ మాజీ చైర్మన్ నూర్ మహమ్మద్ ఆశిస్తున్నారు. ఇండియా కూటమి తరపున ఈ స్థానం నుంచి సీపీఐ పోటీ చేయాలని భావిస్తోంది. కళ్యాణదుర్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బలమైన అభ్యర్థిని ఆ నియోజకవర్గం నుంచి పోటీలో నిలపాలని ఆ పార్టీ అధిష్ఠానం యోచిస్తోంది. అనంతపురం పార్లమెంటు స్థానానికి రెడ్డి, బోయ, కురబ, ముస్లిం మైనార్టీల సామాజికవర్గాలలోని ఒక బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం యోచిస్తోంది. ఆయా సామాజికవర్గాల్లో బలమైన నాయకుల కోసం ఆరా తీస్తోంది. నాలుగైదు రోజుల్లో పెండింగ్ స్థానాలపై స్పష్టత వస్తుందని సమాచారం.



దెబ్బకు ఇళ్లలో దూరుకున్నారు..
(అనంతపురం సప్తగిరి సర్కిల్)

కనిపిస్తే.. కాల్చివేత..!

నింగి నుంచి నిప్పుల వర్షం

వేసవి తీవ్రత తారస్థాయికి చేరుతోంది. జిల్లాలో ఉష్ణోగ్రత 43 డిగ్రీలు దాటుతోంది. వేసవి తాపానికి జనంతోపాటు జీవరాశులన్నీ అల్లాడిపోతున్నాయి. చుక్క నీటికోసం ఎక్కడెక్కడో వెతుకుతున్నాయి. నాలుక పిడుచకట్టుకుపోయి.. మూగజీవాలు నీరసించిపోతున్నాయి. పగటి పూట రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. కర్ఫ్యూ విధించినా ఈ స్థాయి నిర్మానుష్యం కనిపించదేమో అన్నట్లుగా.. ఒక్కరూ బయట కనిపించడం లేదు. యాడికి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఓ కోతి కొళాయి నీటిని తాగేందుకు తన శక్తినంతా కూడగట్టుకుని ప్రయత్నించింది. చుక్క చుక్కగా కారిన నీటితో నాలుక తడుపుకుంది. యాడికిలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

- యాడికి

- వివరాలు 7లో..



గట్టిగా.. పీలిస్తే నీళ్లొస్తాయేమో..



నీకూ దప్పికౌతోందా..?



పై నుంచి తిప్పి చూస్తా..



నాలుక తడి అయితే చాలు..



ఇఫ్తార్	బుధవారం సాయంత్రం	06:34
సెహరీ	గురువారం ఉదయం	04:56

ఉష్ణోగ్రతలు (బుధ)

గరిష్ఠం	41.0
కనిష్ఠం	27.0



అనంతపురం: వ్యాపారులకు ఎదురుచూపులే..

భగ..భగ..!

● మండిపోతున్న ఎండలు ● 44 డిగ్రీల చేరువలో పగటి ఉష్ణోగ్రతలు



గొడుగులతో విధులకు నర్సులు..

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 2: ఉమ్మడి జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. బయటికి వస్తే భానుడు భగ..భగ మండిపోతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాడు. ఉదయం 9గంటలు దాటితే... బయట అడుగు పెట్టాలంటే జంకుతున్నారు. వీటికి తోడు వడగాల్పులతో ప్రమాదాలు తప్పవని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏప్రిల్‌లోనే... ఉమ్మడి జిల్లాలో 44 డిగ్రీల చేరువకు చేరుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి పేర్కొంటున్నారు.



రికార్డు స్థాయిలో నమోదు

మంగళవారం అనంతపురం జిల్లాలో అత్యధికంగా తాడిపత్రిలో 43.23 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. శింగనమల మండలంలో 42.75, బొమ్మనహాళ్ 42.29, శెట్టూరు42.11, పెద్దవడగూరు 42 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, సత్యసాయి జిల్లాలో... తలుపుల 42.05, పరిగి, ముదిగుబ్బ 41.79, కదిరి41.69 కొత్తచెరువు 41.40 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది. మిగిలిన మండలాల్లో 40 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది.

ప్రస్తుతం ఎల్‌నినో బలహీనపడుతున్నా.. దాని ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు. ఈ ఏడు ఎండలు ఆగస్టు వరకు ఉంటాయంటున్నారు. 10 రోజులుగా ఎండల ప్రభావం జిల్లాలో తీవ్రంగా ఉంది.

వేళలు మార్చుకున్న నేతలు..

ఎన్నికల సందర్భంగా రాజకీయాలూ వేడెక్కాయి. ఎండల్లో నేతలు బయటికి రావాలంటే జంకుతున్నారు. చాలా మండలాల్లో రాజకీయ నేతలు ఉదయం ప్రచారం ముగించుకుని సేద తీరి మరోసారి సాయంత్రం ప్రచారాలకు బయల్దేరుతున్నారు. మధ్యాహ్నం బయటికి రావాలంటేనే హడలెత్తుతున్నారు.



ఇంత ఎండలో బయటకు అవసరమా..?



త్వరగా పద..



తప్పదు.. విధి నిర్వహణ..

రాకపోకలు నిషిద్ధం అన్నట్లు.. సుభాష్ రోడ్డు..



కిటకిటలాడే పాతూరు.. లాక్‌డౌన్ సమయంలో కూడా ఇలా ఖాళీగా లేదు..



బస్సు యాత్రలో యానిమేటర్

సీఎం జగన్ చేపట్టిన 'మేము సిద్ధం' బస్సు యాత్రలో వెలుగు యానిమేటర్ పాల్గొన్నారు. సోమవారం బస్సుయాత్రలో ఎర్రదొడ్డివద్ద వై.కొత్తపల్లిలో పనిచేస్తున్న వెలుగు యానిమేటర్ వెంకటరమణమ్మ రోడ్ షోలో పాల్గొన్నారు. వైసీపీ కార్యకర్తలు, ప్రజలతో కలిసి కోలాట వేశారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన యానివేటర్ ఓపార్టీకి అనుకూలంగా వ్యవహరించడం ఏమిటని చర్చించుకుంటున్నారు.

- కదిరి అర్బన్



కోలాటం ఆడుతున్న యానిమేటర్ వెంకటరమణమ్మ

టీడీపీలో చేరినందుకు..

గుంతకల్లు, ఏప్రిల్ 2: మండలంలోని కొంగనపల్లి గ్రామానికి చెందిన రవి అనే రైతు పొలంలో ఉంచిన స్ప్రింక్లర్లు, నీటి పైపులను దుండగులు మంగళవారం నిప్పుపెట్టి కాల్చేశారు. గత నెలలో గుమ్మనూరు జయరాం టీడీపీలోకి రాగానే వైసీపీ రవి టీడీపీలో చేరారు. పార్టీ మారానన్న అక్కసుతో తనపై కొందరు కక్షగట్టి స్ప్రింక్లర్లు, పైపులకు నిప్పుపెట్టి నష్టపరిచారని రైతు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడు టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామిని కలసి తనకు రూ. 1.70 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు. నారాయణ స్వామి మాట్లాడు తూ ఎన్నికల వేళ ఇటువంటి అకృత్యాలను పోలీసులు అడ్డుకోవాలన్నారు.

ఐ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 2: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కొరకు నిర్వహిస్తున్న ఐసెట్-2024కు దరఖాస్తు చేసుకోవాలని సెట్ నిర్వహణ ఛైర్మన్, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో కోరా రు. గతనెల 3నుంచి ఆన్‌లైన్‌ద్వారా స్వీకరిస్తున్న దర ఖాస్తుల గడువు ఈ నెల7తో ముగుస్తుందన్నారు. ఏదేని డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిచేసి దరఖాస్తుచేసుకున్న వారికి మే 6,7న పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు https:// cets.apsche.ap.gov.in/ ICET/ICET/ICET_ HomePage. aspx వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 20 నుంచి 30 రోజుల పాటు ఈ శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. 19-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఆధార్, రేషన్ కార్డు కలిగిన ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలు అర్హులన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ముసుగు తీశారు..

కదిరి పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన.. పట్నం వద్ద ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఉన్న ముగుసును వైసీపీ నాయకులు తొలగించారు. మేమంతా సిద్ధం బస్సుయాత్ర సందర్భంగా సోమవారం విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించారు. వైసీపీ రంగులతో కూడిన పూలమాలను వైఎస్సార్ విగ్రహానికి వేశారు. కోడ్ ఉల్లంఘన జరిగినా.. అధికారులు చూసీ చూడనట్టు వదిలేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- కదిరి అర్బన్



భూసార పరీక్షలపై నిర్లక్ష్యం

● ఇప్పటిదాకా టార్గెట్ ఇవ్వని ప్రభుత్వం ● వైసీపీ పాలనలో ఊసే లేని వైనం
● భూసార హెల్త్ కార్డుల జారీకి బ్రేక్ ● గతేడాది నామమాత్రంగా మట్టి పరీక్షలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 2: భూసార పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది భూసార పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటి దాకా ఎలాంటి టార్గెట్ ఇవ్వలేదు. ఏటా ఏప్రిల్, మే మాసాల్లో మట్టి నమూనాలు సేకరించడంతోపాటు భూసార పరీక్షలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఇప్పటి వరకు భూసార పరీక్షలకు సంబంధించి టార్గెట్‌ను ఇవ్వకపోవడం గమనార్హం. గతేడాది ఆలస్యంగా టార్గెట్ ఇవ్వడంతో నామమాత్రంగా భూసార పరీక్షలు నిర్వహించి చేతులేత్తేశారు. ఈ సారైనా సకాలంలో భూసార పరీక్షలు నిర్వహించి, రైతులకు భూసార హెల్త్ కార్డులు అందజేస్తారనుకుంటే ఇప్పటి వరకు టార్గెట్‌పై ఊసేఎత్తకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ ఇప్పటికే అమలైంది. ఈ పరిస్థితుల్లో ఈ సారి భూసార పరీక్షలు నిర్వహించడంపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ సాగుతోంది. పంటల సాగులో అత్యంత కీలకమైన భూసార పరీక్షలు తప్పని సరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



శాంపిళ్లు కలియబెట్టే షేకింగ్ యంత్రాలు

హెల్త్ కార్డులకూ దిక్కులేదు..

టీడీపీ హయాంలో ఏటా వేసవిలో భూసార పరీక్షలు నిర్వహించి భూసార హెల్త్ కార్డులు జారీ చేసేవారు. పరీక్షల ఆధారంగా పంటలకు తగిన మోతాదులో ఎరువులు వాడితే మంచి దిగుబడితోపాటు భూసారాన్ని పరిరక్షించే అవకాశం ఉంటుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భూసార పరీక్షలు చేయడాన్ని మానేసింది. 2019-20, 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఒక్క భూసార పరీక్షలు నిర్వహించలేదు. 2014 నుంచి 2019 దాకా 2.67 లక్షల దాకా టీడీపీ ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహించారు. భూసార పరీక్షల ద్వారా పొలాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మధాతువులు జింక్, మాంగనీస్, కాపర్, బోరాన్ తదితర పోషకాలు ఏ పరిమాణంలో ఉన్నాయో తెలుస్తుంది. ఆయా పొలాల్లో ఏఏ రకాల పంటలు పండించవచ్చో రైతులు తెలుసుకోవచ్చు. సిఫార్సు చేసిన ఎరువులను తగిన మోతాదులో వాడితే మంచి దిగుబడి వస్తుంది. అయితే గత ఐదేళ్లుగా భూసార పరీక్షలు చేయకపోవడంతో రైతులు ఎడాపెడా పొలాల్లో ఎరువులు వాడటం ద్వారా భూముల్లో సమతుల్యత లోపించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది నామమాత్రంగా పరీక్షలు

గతేడాది ఆలస్యంగా భూసార పరీక్షలకు సంబంధించిన లక్ష్యాన్ని ఇచ్చారు. 2023-24 ఖరీఫ్‌లో 10వేల మట్టి నమూనాల సేకరణ, రబీలో 36,745 భూసార పరీక్షలు ని ర్వహించాలని నిర్ణయించారు. రెండు సీజన్లల్లో మొత్తం 46,745 మట్టినమూనాల సేకరించి భూసార పరీక్షలు నిర్వహించాలని టార్గెట్ విధించారు. అయితే అందులోనూ అధికారులు నిర్లక్ష్యం వహించారు. నామమాత్రంగా భూసార పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. కేవలం 10వేల మట్టి నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించడంతో సరిపెట్టారు.



అనంత భూసార పరీక్షా కేంద్రం

ఉమ్మడి జిల్లాలకు అనంత కేంద్రమే దిక్కు

గతంలో అనంత జిల్లా కేంద్రంలోని భూసార పరీక్షా కేంద్రంతోపాటు ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లో భూసార పరీక్షా కేంద్రాల్లో మట్టి పరీక్షలు చేస్తూ వచ్చారు. అయితే ఈ ఐదేళ్లలో ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లోని భూసార పరీక్షా కేంద్రాలను మూసేశారు. ఉమ్మడి జిల్లాలోని మట్టినమూనాల పరీక్షలకు అనంత భూసార పరీక్షా కేంద్రమే దిక్కుగా మారింది. నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్‌లోనే మట్టి నమూనాల పరీక్షలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ ఉన్నతాధికారులు ప్రకటిం చారు. అగ్రి ల్యాబ్స్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారు. భూసార పరీక్షలకు సంబంధించిన అగ్రి ల్యాబ్స్‌లో మట్టి పరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలు ఇవ్వలేదు. అక్కడ మట్టి పరీక్షలు నిర్వహించడం లేదు.



మూతపడిన ధర్మవరం, పెనుకొండ భూసార పరీక్ష కేంద్రాలు

ఇంకా టార్గెట్ రాలేదు : రోజా పుష్పలత, ఏడీఏ



టార్గెట్ కోసమే ఎదురుచూస్తున్నాం. ఈ ఏడాది వేసవిలో భూసార పరీక్షలకు సంబంధించి ఇంకా టార్గెట్ రాలేదు. ఉన్నతాధికారుల నుంచి టార్గెట్ ఇవ్వగానే క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమూనాలు సేకరించి పరీక్షా కేంద్రానికి పంపిస్తారు. మట్టి నమూనాలు వచ్చి తర్వాత పకడ్బందీగా భూసార పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

కూతురిపై అత్యాచారం

తండ్రిపై పోక్సో కేసు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 2: రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో కన్న కూతురిపై తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో బాధిత బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. ప్రభుత్వ వసతి గృహంలో ఉంటున్న బాలిక.. ఆదివారం సెలవు కావడంతో ఇంటికి వెళ్లింది. హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. అదే రోజున బాలిక తండ్రి చేతిలో అత్యాచారానికి గురైంది. బాధితురాలిని మరుసటి రోజున తాత హాస్టల్లో వదిలివెళ్లాడు. బాలిక దిగులుగా ఉండటం, అధికంగా రక్తస్రావం కావడంతో వార్డెర్ ఆరా తీశారు. విషయం తెలిగానే జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. బాలికకు వైద్య పరీక్షల నిర్వహించిన అనంతరం స్పష్టత వస్తుందని తెలిపారు.

అప్పు చెల్లించలేదని కిడ్నాప్?

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 2: అప్పు తిరిగి చెల్లించని వ్యక్తిని కిడ్నాప్ చేస్తూ.. రోడ్డు ప్రమాదంతో దొరికిపోయారు. ధర్మవరం మండలం తుంపర్తి జగనన్న కాలనీలో మంగళవారం ఓ ఇంటిని కారు ఢీకొనడంతో కిడ్నాప్ ఉదంతం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన మేరకు.. హైదరాబాద్‌కు చెందిన మురళి అనే వ్యక్తి అదే నగరానికి చెందిన విజయ్‌కు దాదాపు రూ.2 లక్షలు అప్పు ఇచ్చాడు. విజయ్ అప్పు తిరిగి చెల్లించకలేదు. కొన్ని నెలల క్రితం చెన్నేకొత్తపల్లి మండలం యర్రోనిపల్లిలోని బంధువుల వద్దకొచ్చి, అక్కడే రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న మురళి, తన అనుచరులతో గ్రామానికి వెళ్లాడు. తన అప్పు చెల్లించాలని విజయ్‌పై ఒత్తిడి తెచ్చాడు. అప్పు చెల్లించే పరిస్థితిలో లేనని అనడంతో కారులో బలవంతంగా ఎక్కించుకుని ధర్మవరం మీదుగా హైదరాబాద్ బయల్దేరారు. మార్గం మధ్యలో తుంపర్తి సమీపాన జగనన్న కాలనీ వద్దకు రాగానే విజయ్ వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. వెనుక కూర్చున్న విజయ్ ఒక్కసారిగా కారు స్టీరింగ్‌ను తిప్పాడు. దీంతో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి కాలనీలో కొండారెడ్డి ఇంటిని బలంగా ఢీకొంది. దీంతో ఇంటి ముందుభాగం దెబ్బతింది. కారులోని వారు సురక్షితంగా బయటపడ్డారు. ఇంటి యాజమానితోపాటు స్థానికులు.. వారిని పట్టుకుని కారుతోపాటు రూరల్ పోలీసుస్టేషన్‌కు అప్పజెప్పారు. ఇళ్లు దెబ్బతిందని, పరిహారం ఇప్పించాలని యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా కిడ్నాప్ ఉదంతం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. బాధితుడు విజయ్.. కిడ్నాపర్లపై ఫిర్యాదు చేయకపోవడంతో ఇంటి యాజమాని ఇచ్చిన ఫిర్యాదునే పోలీసులు పరిగణనలోకి తీసుకుని కేసు నమోదు చేశారని సమాచారం. ఇంటిని కారు ఢీకొట్టినట్లు ఫిర్యాదు చేశారని, కిడ్నాప్‌పై ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్ఐ నరేంద్ర అన్నారు. కారులో ఉన్న వారు బంధువులని తెలిపారని, దీంతో ఇంటి యాజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

ఏంటి ముఠాను నడుపుతున్నావా..?

● ఇష్టానుసారం విధులు కేటాయిస్తారా..? ● హెచ్‌ఎంలు కాకుండా ఎంఈఓలతో పనేంటి..?
● టెన్త్ స్పాట్‌లో ఏసీపై ఆర్‌జేడీ ఫైర్ ● సెలవులో వెళ్తానంటూ.. ఏసీ అలక ● బుజ్జగించిన డీఈఓ

అనంతపురం విద్య, ఏప్రిల్ 2 : "ఏంటి ముఠాను నడుపుతున్నావా..? ఇష్టానుసారం విధులు వేసేస్తావా.. రూల్స్ ఫాలో కావా.." ఆర్‌జేడీ ఫైర్ అయ్యారు. టెన్త్ క్లాస్ పరీక్షలు, స్పాట్ విషయంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ నాయక్ ఏకపక్షంగా వ్యవహరించడంపై కడప ఆర్‌జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లా పరీక్షల పరిశీకులు రాఘవరెడ్డి తీవ్ర స్థాయిలో ఫైర్ అయినట్లు సమాచారం. పది పరీక్షల విధులు, స్పాట్‌లో ఏకపక్షంగా వ్యవహరిస్తూ...కొందరికే పెద్దపీట వేయడంపై ఇటీవల కొందరు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మధ్యాహ్నం కేఎస్ఆర్ హైస్కూల్, జూనియర్ కాలేజీ పరిసరాల్లో జరుగుతున్న 10వ తరగతి పరీక్షల మూల్యాంకనాన్ని ఆర్‌జేడీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపై తీవ్ర స్థాయిలో మండిపడినట్లు తెలిసింది. ఇష్టారాజ్యంగా విధులు కేటాయిస్తావా...?, స్పాట్‌కు ప్రధానోపాధ్యాయులను కాకుండా, ఎంఈఓలకు ఎలా విధులు వేస్తారంటూ...అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆగమేఘాల నలుగురు ఎంఈఓలు రవినాయక్, గురుప్రసాద్, ఓబుళపతి, క్రిష్ణయ్యను ఆర్‌జేడీ రిలీవ్ చేస్తూ...ఆదేశాలు జారీ చేశారు. వారి స్థానంలో నలుగురు హెచ్‌ఎంలను స్పాట్ విధుల్లో నియమించారు. ఆర్‌జేడీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, ఈ హఠాత్ పరిణామంతో... ఏసీ గోవింద్ నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు స్పాట్‌లోని ఉపాధ్యాయుల ద్వారా తెలుస్తోంది. తాను సెలవుపై వెళ్తానంటూ.... అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. తర్వాత డీఈఓ వరలక్ష్మి పిలిపించి బుజ్జగించినట్లు తెలుస్తోంది. అయితే ఘటన టెన్త్ స్పాట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.





మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

కార్యకర్తల అభీష్టం మేరకు ముందుకు.!

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 2: కార్యకర్తల అభీష్టం మేరకు ముందుకు వెళతానని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని తన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తనతో చర్చించిన మేరకు మరో రెండు రోజుల్లో చంద్రబాబు నుంచి పిలుపు వచ్చే అవకాశం ఉందన్నారు. చంద్రబాబు వద్ద ఏం చెప్పాలని కార్యకర్తలను ఆయన ప్రశ్నించారు. ఇందుకు పలువురు నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. 'వైసీపీ ఐదేళ్ల పాలనలో మాపై అనేక అక్రమ కేసులు బనాయించారు... ఐదేళ్ల కష్టకాలంలో పార్టీ కోసం పనిచేశాము.. అనంత అర్బన్ ఎమ్మెల్యే టికెట్ వైకుంఠం ప్రభాకర్ చౌదరికే ఇవ్వాలి... అందరం చందాలు వేసుకొని వైకుంఠంను గెలిపించుకుంటాం..' అని చంద్రబాబును కోరాలని వారు సూచించారు.

వైసీపీ కాంట్రాక్టర్లకు పింఛన్ సొమ్ము



మాజీ మేయర్ స్వరూప

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి పింఛన్ల సొమ్మును సొంత కాంట్రాక్టర్లకు సీఎం జగన్ దోచిపెట్టాడని మాజీ మేయర్ స్వరూప ఆరోపించారు. మంగళవారం అనంతపురం నగరంలోని తన నివాసంలో ఆమె మాట్లాడుతూ... నిధులు లేకపోవడం వల్లే సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో వైసీపీ ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయించడం లేదని, ఆ విషయాన్ని తొక్కిపెట్టి టీడీపీ, ఎన్నికల కమిషన్లపై నెపం మోపడం హేయమని అన్నారు. వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ప్రజాసేవ చేసే వలంటీర్లను టీడీపీ హయాంలో యథావిధంగా కొనసాగిస్తామన్నారు. జిల్లాలో ఎండతీవ్రను దృష్టిలో ఉంచుకొని పింఛన్‌దారులకు ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ సొమ్మును పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పలువురు వలంటీర్ల రాజీనామా

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : అనంతపురంరూరల్ మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలోని 120 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. పాపంపేట సచివాలయం -4 నుంచి 29మంది, సోములదొడ్డి సచివాలయం నుంచి 14 మంది, కక్కలపల్లికాలనీ-2 నుంచి 16 మంది, ఆకుతోటపల్లి 1,2 సచివాలయల పరిధిలో 20 మంది, ఉప్పరపల్లిలో 19 మంది, రాచానపల్లిలో 22 మంది రాజీనామా చేశారన్నారు. వారి రాజీనామాలను ఆమోదించినట్లు తెలిపారు. ఆత్మకూరు మండలంలో పీ.సిద్దరాంపురంలో నలుగురు, ముట్టాల గ్రామంలో ఒక వలంటీరు మంగళవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. రాప్తాడు మండలంలోని రాప్తాడు 1, 2వ, ప్రసన్నాయపల్లి గ్రామ సచివాలయ వలంటీర్లు 36 మంది తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ గీతావాణికి మంగళవారం అందచేశారు. చెన్నేకొత్తపల్లి మండలంలో 21 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులందరికీ బీఈడీ ప్రవేశం కల్పించాలి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 2: ఎడ్‌సెట్ ర్యాంకుతో సంబంధం లేకుండా ఆశక్తిగల విద్యార్థులందరికీ బీఈడీ కోర్సుల్లో ప్రవేశం కల్పించాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర వర్సిటీల కన్వీనర్ యనమల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బీఈడీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు ఎస్కేయూ అధికారులు స్పాట్ అడ్మిషన్‌ల ప్రక్రియచేపట్టారన్నారు. అయితే ఎడ్‌సెట్-2023లో అర్హత సాధించిన వారికే ప్రవేశం కల్పిస్తామని షరతు విధించడంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 2: మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త డి నారాయణ (51)గుండెపోటుతో మరణించాడు. సోమవారం రాత్రి తన పొలంలో ఉండగా ఛాతిలో నొప్పి వచ్చింది. వెంటనే కుటుంబసభ్యులు ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నారాయణకు భార్య చంద్రమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహానికి టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి మంగళవారం ఉదయం నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, నాయకులు రామసుబ్బమ్మ, ఎజ్జే శంకర్, రామకృష్ణారెడ్డి, వసల పెద్దవెంకటరాముడు, లద్దు లక్ష్మయ్య వెంకటేశ్, బాస్కర్, జగదీశ్ ఉన్నారు.

సమ్మేళనానికి అనంత కవులకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2 : క్రోధి నామ సంవత్సర ఉగాదిని ఈనెల 5న నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సమావేశ మందిరంలో నిర్వహించే కవిసమ్మేళనానికి అనంత కవులకు ఆహ్వానం అందింది. నగరానికి చెందిన కవులు గుత్తా హరిసర్వోత్తమనాయుడు, ఆకుల రఘురామయ్యను ఆహ్వానించినట్లు ఆ కేంద్రం అధ్యక్షుడు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు ఉమ్మడి రాష్ట్రాల నుంచి మొత్తం 177 మంది కవులు ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఏఐఎస్ఏ నుంచి ఆలం, భారతి తొలగింపు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 2: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ అనుబంధ సంస్థ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) నుంచి అబ్దుల్ ఆలం, ప్రతిభా భారతిని తొలగించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి, జిల్లా కార్యదర్శి టీఎస్ వలి మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శిగా అబ్దుల్ ఆలం, కమిటీ సభ్యురాలిగా ప్రతిభా భారతి పనిచేశారన్నారు. వారు పార్టీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, పార్టీ కట్టుబాట్లకు వ్యతిరేకంగా దౌర్జన్యాలకు పాల్పడటమే కాకుండా సహచర నాయకులపైనా బెదిరింపులకు దిగుతూ భౌతికంగా దాడులు చేస్తున్నారని అన్నారు. నాయకత్వంతో సంబంధం లేకుండా విచ్చలవిడి నిర్ణయాలతో క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని, దీంతో వారిద్దరినీ తొలగించామని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

టీడీపీతోనే చేనేతల సంక్షేమం..!

- ఉచిత విద్యుత్.. సబ్సిడీపై ముడిసరుకు ఇస్తాం
- ప్రచారంలో పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఏప్రిల్ 2: తెలుగుదేశం పార్టీతోనే చేనేతల సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాచానపల్లి పంచాయతీ సిండికేట్‌నగర్, దోబీ కాలనీ, బీఎస్ఆర్ కాలనీ, అక్కంపల్లి పంచాయతీ పరిధిలోని అక్కంపల్లి, ఎన్ఆర్‌కాలనీ, ధర్మభిక్షం కాలనీ, సదాశివన్ కాలనీ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మగ్గం ఉన్న చేనేతలకు 200 యూనిట్లు , మరమగ్గాలు ఉన్నవారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. ముడి సరుకు కొనుగోలుకు రాయితీలతో పాటు రుణాలు మంజూరు చేస్తామన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేస్తామన్నారు. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కామన్ వర్కింగ్ షెడ్ల నిర్మాణం కూడా చేస్తామన్నారు. బీజేపీ పొత్తుతో ముస్లింలు ఒకింత ఆందోళనలో ఉన్నారని వారు ఏ మాత్రం అపోహ పెట్టుకోవద్దని, 2014-19 వరకు బీజేపీతో పొత్తులో ఉన్నామని కానీ ఏరోజు ముస్లింలకు ఇబ్బందులు కల్గలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సిండికేట్ నగర్‌లో ప్రచారం చేస్తున్న పరిటాల సునీత

ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలి

కలెక్టర్‌కు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ వినతి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 2: ఉమ్మడి అనంత జిల్లాలో ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమికి వినతి పత్రం అందజేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి అనంత జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాను ప్రత్యేకంగా గుర్తించి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. పింఛన్ల పంపిణీని టీడీపీ అడ్డుకుంటోందని వైసీపీ నాయకులు అసత్యప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయించవద్దని, రెగ్యులర్ ఉద్యోగులతో పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, దీనికి టీడీపీతో ఎలాంటి సంబంధమూ లేదని అన్నారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్ టీడీపీ నాయకులు సిమెంట్ పోలన్న, దళవాయి వెంకటనారాయణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు : నగరంలోని 35,36వ డివిజన్ల పరిధిలోని పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో దగ్గుబాటి ప్రసాద్ సమక్షంలో వారు టీడీపీలోకి చేరారు.



దగ్గుబాటి ప్రసాద్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

వైసీపీ డ్రామాలు నమ్మకండి : బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 2: నిధులు లేకపోవడం వల్లే వైసీపీ ప్రభుత్వం పింఛన్లను ఒకటో తేదీన ఇవ్వలేదని, కాని ఆ నెపాన్ని టీడీపీపై నెట్టేలా వైసీపీ నాయకులు చేస్తున్న డ్రామాలు ప్రజలు నమ్మరాదని శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. టీడీపీ అధికా రంలో వచ్చినా వలంటరీ వ్యవస్థ ఉంటుం దని, వారితోనే ఒకటో తేదీనే ఇంటి వద్దకు పింఛన్లు పంపిణీ చేస్తామని అన్నారు. వీటిపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మరాదని కోరారు. మంగళవారం మండ లంలోని పెద్ద మట్లగొంది, చిన్నమట్లగొంది. నారాయనవారి పల్లి, ఆనందరావుపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, డేగల కృష్ణమూర్తి, మారుతి నాయుడు, అమ్మల దిన్నె షాలిని, అమృత, ఈశ్వర్‌రెడ్డి, చితంబ రిదొర, అబ్దుల్ జిలానీ, అనీల్, నాగేంద్ర గుర్రం లక్ష్మీనారాయణ, సురేంద్ర పాల్గొన్నారు.



చిన్నమట్లగొంది మహిళకూలీలతో బండారు శ్రావణిశ్రీ

దురుద్దేశంతోనే పింఛన్ల పంపిణీ జాప్యం

వైసీపీపై ఆలం, ముంటిమడుగు ధ్వజం

శింగనమల, ఏప్రిల్ 2: రాష్ట్రంలో పింఛన్ల పంపిణీని వైసీపీ నాయకులు దురుద్దేశంతోనే జాప్యం చేస్తూ వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బంది పెడుతున్నారని శింగనమల నియో జకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి మండిపడ్డారు. పింఛన్లు ఇవ్వకుండా టీడీపీ అధినేత చంద్రబాబే అడ్డుకొంటు న్నారంటూ వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదని ధ్వజమెత్తారు. మంగళవారం మండ లంలోని నాయనవారిపల్లిలో వారు మాట్లా డుతూ... టీడీపీ అధికారంలోకి వచ్చినా వలంటరీ వ్యవస్థ అలాగే ఉంటుందని, వారి ద్వారానే ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తామని పింఛన్‌దారులకు స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తూనే వలంటీర్లను తొలగిస్తారంటూ వైసీపీ చేస్తున్న ప్రచారాలను నమ్మరాదని వారు వలంటీర్లకు సూచించారు. వైసీపీ నాయకులు కేవలం రాజకీయ లబ్ధికోసమే పింఛన్ దారులను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శిం చారు. కార్యక్రమంలో డేగల కృష్ణమూర్తి, మారుతి నాయుడు, మాసూల చంద్ర, అదెప్ప, పెద్దన్న పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆలం, ముంటిమడుగు

టీడీపీలోకి వైసీపీ శ్రేణులు క్యూ

అనంతపురంరూరల్, ఏప్రిల్ 2: తెలుగుదేశం పార్టీలోకి వైసీపీ నాయకులు క్యూ కట్టారు. మంగళవాం మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, రాచానపల్లి పంచాయియితీ సిండికేట్ నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత తన క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీలోకి ఆహ్వానించారు.

శింగనమల : మండలంలోని చిన్న మట్లగొంది గ్రామానికి వైసీపీకి చెందిన పలువురు టీడీపీలోకి చేరారు. మంగళవారం శింగనమల మండలంలోని చిన్న మట్లగొందిలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో 15 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి.





పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

బ్రాహ్మణ కుటుంబానికి చేయూత

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2: నగరంలోని మూడో రోడ్డులో నివాసముంటున్న బ్రాహ్మణుడు మధుసూదనరావు కుటుంబానికి సాయి ట్రస్టు చేయూతనందించింది. మధుసూ దనరావు మూడో రోడ్డులోని షిర్డి సాయిబాబా ఆలయంలో ప్రసాదం తయారు చేసే పని చేసుకుం టూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొద్దిరోజుల క్రితం ప్రసాదం తయారు చేస్తుండగా వేడి పొంగలి అతని కాళ్లమీద పడడంతో ప్రమాదానికి గురై ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. దీంతో కుటుంబ పోషణ భారమైన ఆయన సాయి ట్రస్టును సంప్రదించాడు. మంగళవారం సాయి ట్రస్టు సిబ్బంది మధుసూదనరావు నివాసానికి చేరుకుని ఐదు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్, రామకృష్ణ, కరణం కళ్యాణ్, అంబటి అఖిల్, బాలాజిశర్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 2: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.28 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.18 వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 649 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

ఇంటింటి ప్రచారానికి అనుమతి తప్పనిసరి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2: పార్టీల నాయకులు ఇంటింటి ప్రచారం చేయడానికి కూడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని కలెక్టరు గౌతమి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో వ్యయ పర్యవేక్షణ కమిటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికలలో వ్యయ పర్యవేక్షణ అత్యంత కీలకమైనదని, డీఈఓలు, ఆర్ఓలు అభ్యర్థులకు ఎలాంటి అనుమతులు ఇస్తున్నారో వాటి వ్యయ వివరాలు ఎప్పటికపుడు తెలుసుకోవాలన్నారు. ఏమైన ఉల్లంఘనలు ఉంటే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రోజువారి ఎన్నికల ఖర్చును అభ్యర్థులు వారి ఖాతాల్లో నమోదు చేస్తున్నారా లేదా అని నిఘా పెట్టి టీమ్‌లు నిత్యం మానటరింగ్ చేయాలన్నారు. నామినేషన్లు వేసేటపుడు అభ్యర్థుల నుంచి తప్పకుండా బ్యాంకు కొత్త ఖాతాలను తెరిపించాలన్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి అనుమతి తీసుకున్నారా... ఆ ప్రకారం ఫ్లెక్సీలు, పాంప్లెట్లు పంపిణీ, వాహనాలు వినియోగం తదితర వాటిని పరిశీలించాలని సూచించారు. ఖర్చులకు సంబందించి ఓచర్లు, ఆదారాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకు సంబందించి ఖర్చుల పరిశీలన పక్కాగా ఉండాలని అధికారులకు కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, డీసీఓ అరుణకుమారి, మానటరింగ్ సెల్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల జాగ్రత్త

ఎండలు విపరీతంగా పెరిగాయని, వడదెబ్బ బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టరు గౌతమి సూచించారు. మంగళవారం వడదెబ్బపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. ఎండాకాలంలో వడగాలులు వల్ల జరిగే ప్రమాదంపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. వైద్య, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, పశువర్ధక, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రణాళికను పగడ్బందీగా అమలు చేయాలన్నారు. తాగునీరు ఉండేలా చూడాలని, ఉపాధి పనులు ఉదయం పూటే చేపట్టాలని, చలివేంద్రాలు వీలైనంతమేర ఏర్పాటు చేయించాలని, ఎండలకు బయటతిరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



కుర్లపల్లిలో ప్రచారంలో పాల్గొన్న కనగానపల్లి టీడీపీ నాయకులు



మైనార్టీ కాలనీలో టీడీపీ నాయకులు ప్రచారం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రచారంలో టీడీపీ నాయకులు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : రాష్ట్ర అభివృద్ధి ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని, ఆయన్ను తిరిగి ముఖ్యమంత్రిగా చేయడం చారిత్రాత్మక అవసమని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. నార్పల మండలంలోని హెచ్ శోదనపల్లి, మంగపట్నం గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కనగానపల్లి మండలంలోని కుర్లపల్లి, తండా గ్రామాల్లో టీడీపీ రాష్ట్రకార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే రాప్తాడు పంచాయతీ పరిధిలోని మైనార్టీ కాలనీలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ దర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ తిరుపాలు ఆధ్వర్యంలో, రామగిరి మండలం కుంటిమద్దిగ్రామంలో టీడీపీ శ్రేణులు ప్రచారం నిర్వహించాయి.



రామగిరి మండలం కుంటిమద్దిలో టీడీపీ శ్రేణుల ప్రచారం

ఓటు హక్కును వినియోగించుకోండి

రాప్తాడు, ఏప్రిల్ 2: ఓటర్లు అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ఓటింగ్ శాతం పెంచాలని రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఓటర్లు, బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు స్వగ్రామానికి వచ్చి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామన్, ఎంపీడీఓ గీతావాణి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అభ్యర్థులు రోజూ వారి ప్రచార ఖర్చుల వివరాలు తెలపాలన్నారు. ప్రచారానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. 85 సంవత్సరాలు నిండిన వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు సదుపాయం కల్పిస్తామన్నారు. ఈనెల 18 నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

పింఛన్లు త్వరగా పంపిణీ చేయాలి

రాప్తాడు, ఏప్రిల్ 2: పింఛన్ డబ్బు వేగంగా పంపిణీ చేయాలని టీడీపీ మండల ప్రధాన కార్య దర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రాప్తాడులో రిటర్నింగ్ అధికారి వసంతబాబుకు వినతిపత్రం అందజేశారు. పింఛదారులకు ఇబ్బంది కలుగకుండా ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ధర్మవరంరూరల్ : కనగానపల్లి మండలంలో సామాజిక పింఛన్లను సచివాలయ ఉద్యోగుల ద్వారా వెంటనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య అధికారులను కోరారు. మంగళవారం కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పింఛన్లు పంపిణీ చేయకుండా ఈ వైసీపీ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తూ ప్రతిపక్ష పార్టీలపై నెపం నెట్టివేస్తున్నా రన్నారు. పింఛన్‌దారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తూ జగన్‌రెడ్డి కావాలనే జాప్యం చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ బిల్లేభాస్కర్, ముత్తవకుంట్ల సర్పంచ్ ఈడిగ పెద్దరామాంజినేయులు, పూజారి రాజాకృష్ణ, లెక్కల ముత్యాలప్ప, సరిపూటి శ్రీరాములు, నెల్లూరిమనోహర్ ఇందులో పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని పింఛన్‌దారులకు వారి ఇంటివద్దకే పింఛన్ సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు ఎంపీడీ ఓ దశరథమరామయ్య కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు వెంకట నారాయణ, వెంకటేసులు, బాల ఉజ్జన్న, కార్తీక్ నందన్, బాబా ఆనంద్, బొమ్మయ్య, రవి పాల్గొన్నారు.







రాప్తాడు, కనగానపల్లి, ఆత్మకూరులో వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

చికిత్స పొందుతూ కూలీ మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 2: అనంతపురం రూరల్ మండల సోములదొడ్డికి చెందిన కూలీ రామాంజినేయులు (48) చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం మరణించాడు. గత నెల 30వ తేదీ రాత్రి రామాంజినేయులు మరో ముగ్గురితో కలిసి సోములదొడ్డి నుంచి వడియంపేటకు ఆటోలో వెళ్తుండగా మరో ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని, కేసు దర్యాప్తులో ఉందని అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్ : అనంతపురం రూరల్ మండలం తాటిచర్లలో ఓ వ్యక్తి బెల్ట్‌షాప్ తరహాలో మద్యం విక్రయిస్తుండగా రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడి అరెస్టు

శింగనమల: మండలంలో ఆకులేడు గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని శింగనమల పోలీస్ అరెస్టు చేశారు. గార్లదిన్నె నుంచి ఆకులేడు గ్రామానికి చెందిన ఆ వ్యక్తి 15 మద్యం బాటిళ్లు తీసుకొని వస్తుండగా... లోలూరు క్రాస్ వద్ద ఎస్ఐ చంద్రశేఖర్ వాటిని సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అభివృద్ధిలో దుర్గం రూపురేఖలు మార్చుతాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు



టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 2: టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధితో నియోజకవర్గ రూపురేఖలు మార్చుతామని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం మండలంలోని ముదినాయనపల్లికి చెందిన కేటీ ముత్యాలప్పతో పాటు పది కుటుంబాలు తిరిగి టీడీపీలోకి చేరాయి. వారికి సురేంద్రబాబు కండువావేసి టీడీపీ పార్టీలోకి ఆహ్వానించారు. రెండు రోజుల కిందట ముత్యాలప్పను వైసీపీ నాయకులు బెదిరించి ఆపార్టీలోకి చేర్చుకున్నారు. అక్కడ ఉండలేక తిరిగి టీడీపీలోకి వచ్చేశారు. టీడీపీ గెలుపుకు శాయశక్తులా కృషి చేస్తానని కేటీ ముత్యాలప్ప తెలిపారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామంలో అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి, కోడలు ఇషిత ఇంటింటికి ప్రచారాన్ని పెద్దఎత్తున చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. మున్సిపాల్టీలో అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్ భారీఎత్తున ఇంటింటి ప్రచారం చేపట్టారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారి ఇళ్ల వద్దకు వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలను పంపిణీచేశారు. టీడీపీ వస్తేనే గ్రామాలన్నీ అభివృద్ధి దిశలో పయనిస్తాయన్నారు. సమన్వయంతో ముందుకు సాగుతూ టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేపట్టిన సురేంద్రబాబు భార్య రమాదేవి

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన పీడీ

గుత్తి, ఏప్రిల్ 2: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు. చంద్రప్రియనగర్, చాకలిగేరి, జంగాలకాలనీ తదితర ప్రాంతాల్లో కేంద్రాలను తనిఖీ చేశారు. టాయిలెట్లు, వంటగదులను పరిశీలించారు. అనంతరం స్టాక్ రికార్డు, రిజిస్టర్లను, భోజనాన్ని ఆమె పరిశీలించారు. పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

ఎంసీసీ ఉల్లంఘనలపై చర్యలు: జేసీ

ఉరవకొండ,ఏప్రిల్ 2: నియోజక వర్గంలో ఎన్నిక కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఎంసీసీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటునట్లు జేసీ, ఆర్వో కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంసీసీ ఉల్లంఘనపై పబ్లిక్ ప్రాపర్టీపై 596 కేసులు, ప్రైవేట్ ప్రాపర్టీపై 399 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. పీవోలు, ఏపీవోలకు 5, 7, 14 తేదీల్లో శిక్షణ ఇస్తామన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

గ్రామ, వార్డు వలంటీర్ల రాజీనామాలు మంగళవారం కూడా కొనసాగాయి. బెళుగుప్ప మండలంలోని దుద్దేకుంట గ్రామ సచివాలయ పరిధిలో విధులు నిర్వర్తించే 12 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో సుబ్బరాజు మంగళవారం తెలిపారు. ఒకే దరఖాస్తుపై 12 మంది సంతకాలు చేసి ఇచ్చారన్నారు.

● పెద్దవడుగూరు మండలంలో 24మంది గ్రామ వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు.

● బొమ్మనహాళ్ మండలంలోని గోనేహాళ్ సచివాలయ పరిధిలో సింగానహళ్లి గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ విజయమ్మ తెలిపారు.

● డీ.హీరేహాళ్ మండలంలోని మురడి గ్రామానికి చెందిన తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ తెలియజేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం



వ్రతాన్ని నిర్వహిస్తున్న భక్తులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 2: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని వివేకానంద పంచపల్లవ ఉద్యానవనంలో మంగళవారం సాయంత్రం నగర ఉత్సవ సమితి, దారాశాంతలక్ష్మి, దారా నాగరంగయ్య సౌజన్యంతో సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజ, అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నగర ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు కాకర్లప్రకాష్, అధ్యక్షుడు బండారు క్రిష్ణమూర్తి, కార్యదర్శి ఇల్లూరు వెంకట సోమనాథ్, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి: ఆర్డీవో

కుందుర్పి, ఏప్రిల్ 2: ఎన్నికల ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆర్డీవో రాణి సుష్మిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్వోలు సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు, దివ్యాంగులు ఓటు హక్కును ఇంటి దగ్గరే వినియోగించు కునే విధంగా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశులు, తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ తిప్పేస్వామి, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇలాగే వదిలేస్తారా ?



పాత సచివాలయంలో అలాగే ఉంచిన నవరత్నాల ఫ్లెక్సీలు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 2: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో పాత సచివాలయ భవనంలో సీఎం జగన్ ఫొటోతో ఉన్న నవరత్నాలకు సంబంధించిన చిత్రాలు దర్శనమిస్తున్నాయి. వైసీపీ జెండా రంగును అలాగే ఉంచారు. చెత్త సంపద తయారీ కేంద్రం షెడ్డుకు కూడా వైసీపీ రంగును అలాగే ఉంచారు. అధికారులు జగన్ ఫ్లెక్సీలను, వైసీపీ రంగును తొలగించకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఎంపీపీ పద్మ స్వగ్రామం కావడంతోనే ఎన్నికల కోడ్ సరిగా అమలు కావటం లేదని అంటున్నారు.



వైసీపీ జెండా రంగుల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రం

వైసీపీ చేతగానితనంతోనే తాగునీటి వ్యవస్థ నాశనం

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



మహిళలతో మాట్లాడుతున్న కేశవ్

ఉరవకొండ, ఏప్రిల్ 2: పట్టణంలో తాగునీటి వ్యవస్థ నాశనానికి వైసీపీ నాయకులు చేతగానితనమేనని కారణమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శిం చారు. పట్టణంలోని ఇందిరానగర్, షిర్డీసాయిబాబా కాలనీలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుమునుపు వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ప్రచారాన్ని కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి సైకిలు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. రూ.600 ఖర్చు పెట్టినా డ్రమ్ము నీళ్లు రావడం లేదని మహిళలు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. రోజుకు వంద రూపాయాలు వెచ్చించి నీటిని కొనుక్కోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్త చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ తాగునీటి కష్టాలకు మాజీ ఎమ్మెల్యే, స్థానిక ప్రతినిధుల నిర్లక్ష్యమే కారణమన్నారు. 12 రోజులకు ఒక్కసారి నీటిని వదులుతున్నారని, అది కూడా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. అరగంట నీటి కోసం ఆరు గంటలు వేచిచూడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీ.పురుషోత్తం, విజయ్‌భాస్కర్, మారెన్న, తిమ్మప్ప, గుర్రంసుధాకర్, కుళ్లాయప్ప, సుంకమ్మ, ప్యారం కేశవానంద, రహంతుల్లా, మోహన్, వీరేష్, అమరేష్ పాల్గొన్నారు.

● టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్ సింహా పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని గూళ్యపాళ్యం, ధర్మపురి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. విడపనకల్లు మండలంలోని కరకముక్కల గ్రామంలో ఎమ్మెల్యే మరో కుమారుడు విజయ్‌సింహా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సైకిలు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

● టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం



పీ కొండాపురంలో సుంకులమ్మ ఆలయంలో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

పామిడి, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కూటమి గుంతకల్లు అసెంబ్లీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. తొలిసారి మండలానికి వచ్చిన ఆయనకు మంగళవారం తెలుగు తమ్ముళ్లు ఘనంగా స్వాగతం పలికారు. మండలంలోని పీ కొండాపురం గ్రామంలోని సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఐదేళ్ల రాష్ట్రం చిన్నా భిన్నమైందన్నారు. రాష్ట్రంలోని అన్ని రంగాల వారు అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడాలని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణ, ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, అప్పన్నగారి కుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, బొమ్మా మోహన్‌కృష్ణ, మారుతి, పత్రా శ్రీనివాసులు, పిక్కిలి రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం తథ్యం

గుంతకల్లు/టౌన్: రానున్న ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన ఆ పార్టీ నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ కంటక పాలనకు అంతిమ ఘడియలు ఆసన్నమయ్యాయన్నారు. దుర్మార్గుడి పరిపాలనలో ప్రజలు నానా కష్టాలు పడ్డారని, అభివృద్ధి లేకుండాపోయిందని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కేసీ హరి, గుమ్మనూరు నారాయణ స్వామి, బీజేపీ నాయకులు కొలిమి రామాంజనేయులు, బండారు కృష్ణమూర్తి, వడ్డే రమేశ్, విశ్వనాథ్, కొలిమి శేకన్న, పురంధర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ



సమస్యలపై ఆరాతీస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి (యాడికి)

యాడికి, ఏప్రిల్ 2: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని తాడిపత్రి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయలచెరువులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని సమస్యలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు కదిరి శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ నాయకుడు రంగనాథ్, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి, మదమంచి శివ, శ్రీహరి, తిరంపురం నీలకంఠ, మాదాల అనిల్, త్రినాథ్ రెడ్డి, చలమారెడ్డి, హరినాథ్‌రెడ్డి, అమిలినేని శ్రీధర్, జాఫర్ పాల్గొన్నారు.

● యాడికి మండలం చందన గ్రామంలో 20కుటుంబాలు టీడీపీలో చేరాయి. తాడిపత్రి టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో ఈశ్వరయ్య, గోవిందరాజులు, రవికుమార్, నాగరాజు, తిప్పన్న తదితరులు ఉన్నారు.

తాడిపత్రిటౌన్: సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని శ్రీరాముల పేట, నంద్యాలరోడ్డు ప్రాంతాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెం టీ జరిగింది. ఈ సందర్భంగా జేసీ అశ్మిత్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమా లు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు.

పెద్దపప్పూరు: మండలంలోని ధర్మాపురం గ్రామంలోని వైసీపీకి చెందిన 20 కుటుంబాలు మంగళవారం జేసీ అశ్మిత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా డీలర్ రమణతోపాటు పలువురికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో చింబిలి వెంకటరమణ, కాకర్ల రంగనాథ, తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

18 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

బొమ్మనహాళ్, ఏప్రిల్ 2: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వైసీపీ నుంచి 18 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. స్థానిక టీడీపీ నాయకులు ఆర్ చంద్రహాస్, సప్తగిరి సత్యనారాయణల ఆధ్వర్యంలో 18 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి తెలుగుదేశం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు టీడీపీ కండువా వేసి తెలుగుదేశంలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సులేమాన్, కెంచప్ప, టీడీపీ నాయకులు ఆర్ మురళి, మల్లన్న, దిలీప్, ప్రేమ్‌కుమార్, జనసేన మండల కన్వీనర్ శివరాజ్, సికిందర్, మల్లీడు శీన పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరగాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 2: ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరగాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆసుపత్రిలో మంగళవారం పీపీయూనిట్ సిబ్బంది, ఆశా వర్కర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఆసుపత్రిలో 150 కాన్పులు జరగాలన్నారు. వైద్యులు సుజాత, కల్యాణచక్రవర్తి, అరుణ, డీపీఎంఓ రామదాసు, హెల్త్ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, పద్మలత, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల ఎన్నికల ప్రచారం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్2: పట్టణంలోని నందలపాడులో మంగళవారం పలువురు రజకులు టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించి వాటిని వివరించారు.

రూ.6.15 లక్షలు స్వాధీనం

పెద్దవడుగూరు, ఏప్రిల్2: మండలంలోని మిడుతూరు గ్రామం వద్ద మంగళవారం అనంతపురానికి చెందిన వెంకటరాముడు నుంచి రూ.6.15లక్షల స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా వెంకటరాముడు కారులో తరలిస్తున్న నగదుకు ఆధారాలు చూపకపోవడంతో సీజ్‌చేసి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

కణేకల్లు రోడ్డు వద్ద రూ.2.70 లక్షలు ...

రాయదుర్గంరూరల్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం రాత్రి అనుమతి లేకుండా డబ్బుని తీసుకొని వెళుతున్న వ్యక్తి నుంచి రూ. 2.70 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అరబిక్ కాలేజ్ వద్ద ఎఫ్ఎస్‌టీటీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బంది వాహనా లను తనిఖీ చేస్తుండగా పట్టణానికి చెందిన దబ్బడి ఉమేష్ నుంచి నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కణేకల్లు నుంచి ద్విచక్రవాహనంలో అనుమతులు లేకుండా రూ. 2.70 లక్షలు తీసుకొని వస్తుండగా పట్టుబడినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

మా సిబ్బందికి సహకరించండి: జీఆర్పీ ఎస్పీ

గుంతకల్లు, ఏప్రిల్2: ప్రయాణికులు, రైల్వేల భద్రత విషయంలో జీఆర్పీ పోలీసులకు సహకరించాలని జీఆర్పీ రైల్వే జిల్లా ఎస్పీ చౌడేశ్వరి డీఆర్ఎంను కోరారు. మంగళవారం ఉదయం ఎస్పీ స్థానిక డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లి డీఆర్ఎం వినీత్ సింగ్‌తో భేటీ అయ్యారు. జీఆర్పీ సిబ్బంది సౌకర్యార్థం చర్యలు తీసుకోవాలని, డివిజన్ హెడ్ క్వార్టర్స్‌కు వచ్చే సిబ్బందికి బ్యారెక్‌ను ఏర్పాటుచేయాలని విన్నవించారు.

బ్యాంకు బంద్‌కు రైతుల యత్నం



బ్యాంకు అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం, సీపీఎం నాయకులు

కణేకల్లు, ఏప్రిల్ 2: తమ సమస్య పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్న బ్యాంకు అధికారుల తీరును నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు యూనియన్ బ్యాంక్ బంద్‌కు మంగళవారం యత్నించారు. గత 15 రోజుల క్రితం యూనియన్ బ్యాంకు పరిధిలో రైతులు తీసుకున్న వ్యవసాయరుణాలకు సంబంధించి వడ్డీ మాత్రమే కట్టించుకునేలా చూడాలని బ్యాంకు అధికారులను కోరారు. వారు ఈ సమస్యను ఉన్నతాధికారులకు వివరించి 15 రోజులలోపు రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మంగళవారం రైతుసంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సీపీఎం నాయకులు కోరి నాగరాజు ఆధ్వర్యంలో రైతులంతా బ్యాంకును ముట్టడించి బ్యాంక్ బంద్‌కు యత్నించారు. దీంతో బ్యాంకు అధికారులు బయటకు వచ్చి మరోసారి రైతుల సమస్యలకు సంబంధించి వినతిపత్రాన్ని తీసుకున్నారు.

మార్పు కోరుకుంటున్న ప్రజలు: టీడీపీ



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 2: వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే టీడీపీకి ఆదరణ పెరిగిందని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఎం హనుమాపురం గ్రామంలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందన్నారు. నియంత పాలన సాగిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికలలో తమ ఓటు ద్వారా తెలుగుదేశం పార్టీని గెలిపించి రాష్ట్రాన్ని కాపాడవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లిగౌడ, తాయప్ప, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



పామిడిలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు (కణేకల్లు)



ఎంపీడీఓకి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు (గుత్తిరూరల్)

ఇబ్బంది లేకుండా పింఛన్లు పంపిణీ చేయాలి

● వివిధ ప్రాంతాల్లో అధికారులను కోరిన టీడీపీ నాయకులు

పింఛన్‌దారులకు ఇబ్బంది లేకుండా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయించాలని టీడీపీ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం పలు ప్రాంతాల్లో ఆయా మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందేందుకు పింఛన్ల పంపిణీని సాకుగా తీసుకుంటోందని మండిపడ్డారు. గుంతకల్లు, గుత్తి, బ్రహ్మసముద్రం, యాడికి, పామిడి, కణేకల్లు, గుమ్మఘట్ట, గుత్తిరూరల్, బెళుగుప్ప, ఉరవకొండ తదితర మండలాల్లో టీడీపీ నాయకులు వినతి పత్రాలు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

టీడీపీతోనే అన్నివర్గాలకు న్యాయం: కాలవ



భోజనం వడ్డిస్తున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 2: టీడీపీ పాలనలోనే అన్ని సామాజిక వర్గాల వారికి న్యాయం జరుగుతుందని రాయదుర్గం తెలుగుదేశం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని ఉంతకల్లు గ్రామంలో టీడీపీ నాయకులు సప్తగిరి సత్యనారాయణ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు కాలవ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం మైనార్టీకు ఇచ్చే దుల్హాన్ పథకాన్ని ఆపేసిందన్నారు. కార్యక్రమంలో బలరాంరెడ్డి, చంద్రహాస్, యర్రగుంట్ల వెంకటేశులు, ముల్లంగి నారాయణస్వామి, కొత్తప ల్లి తిమ్మరాజు, మహేంద్ర, పయ్యావుల అనిల్, పయ్యావుల నాగరాజు, లక్ష్మిరెడ్డి, మల్లీడు శీన, సల్లాపురం బాబు తదితరులు పాల్గొన్నారు.

కాలవను గెలిపిద్దాం: కాపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 2: టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులును గెలిపించాలని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని హటకేశ్వరస్వామి ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నప్పటికీ మోదీ పేరును చెప్పకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే చాలా మంది లబ్ధిపొందారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ఎన్‌డీఏ విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో హీరోజీరావు, జింకా వసుంధరదేవి, సత్యనారాయణ, అంబోజీరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి



చంద్రబాబు, ప్రభాకర్‌రెడ్డితో వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, వీఆర్ విఘ్నేశ్వరరెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్2: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో పోటీ చేసిన వీఆర్ రామిరెడ్డి కుమారులు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీఆర్ వెంకటేశ్వర రెడ్డి, వీఆర్ విఘ్నేశ్వరరెడ్డిలతోపాటు కొనగుంటపల్లికి చెందిన సుందర్‌రెడ్డి టీడీపీలో చేరినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముడియం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

గుంతకల్లు, ఏప్రిల్2: మండలంలోని నల్లదాసరిపల్లి, తిమ్మాపురం, దంచెర్ల గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు మంగళవారం పర్యటించారు. ఆత్మీయ సమావేశాలను నిర్వహించి గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం నుంచి స్పష్టమైన హామీ వస్తే పార్టీని నమ్మిన కార్యకర్తలకు ధైర్యాన్నిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్‌కుమార్ గౌడు, పాలమల్లికార్జున, రాయల రామయ్య, శివన్న, న్యాయవాది హేమాద్రి, ఫణులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 2: వజ్రకరూరు మండలంలోని తట్రగల్లు, ఎన్ఎన్‌పీ తండా గ్రామాల్లోని వైసీపీకి చెందిన వంద కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. మండలంలోని కౌకుంట్లలో వైసీపీ నాయకులు లోకేష్, మస్తాన్, ధనుంజయ, దేవేంద్రలు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, సుధాకర్, నాగేంద్ర పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించాడని కేసు నమోదు

యల్లనూరు, ఏప్రిల్ 2: మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ గిరిబాబు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన బాలిక పట్ల శివశంకర్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

కుందుర్పి, ఏప్రిల్ 2: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా మలేరియా అధికారి ఓబుళు, జిల్లా ఉప మలేరియా అధికారి సత్యనారాయణ, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, కుందుర్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఆశావర్కర్లు మరింత అంకిత భావంతో ప్రజలకు సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు , ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.